క్లుప్తంగా

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసినట్లు చెప్పారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 55, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 140, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 160.

16న చందానగర్‌లో జాబ్ మేళా

గచ్చిబౌలి: నిరుద్యోగ యువత కోసం జీహెచ్ఎంసీ సహకారంతో లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న లైట్ హౌస్ స్కిల్లింగ్ సెంటర్‌లో 16న ఉదయం 11 గంటలకు జాబ్ మేళ ప్రారంభమవుతుందన్నారు. రిటైల్, బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, సేల్స్, ఐటీ, నాన్ ఐటీ తదితర విభాగాలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలున్న వారు హాజరుకావచ్చు. అభ్యర్థులు ఆధార్‌కార్డులు, రెజ్యూమ్‌లు 3 సెట్‌లు తీసుకురావాలని, వివరాల కోసం 8688100660 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఆలయ నూతన కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా విరూపాక్ష, అధ్యక్షుడిగా బెజగం శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా కొండ మనోహర్, ప్రధాన కార్యదర్శిగా చివర రమేష్, అదనపు కార్యదర్శి కంకర్ శ్రీనివాస్, కోశాధికారి పవన్ కుమార్, ముఖ్య సలహాదారుడు వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి సింగర్‌గౌడ్, రామనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శి చెవ్వ వెంకటేష్, మూర్తి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

17న స్పాట్ అడ్మిషన్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీల కోసం ఈ నెల 17వ తేదీన స్పాట్ అడ్మిషన్‌లను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాంప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభించే ముందు గ్రూపుల వారీగా ఖాళీలను ప్రకటిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఈ నెల 17వ తేదీన ఉదయం 10.30గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 10.30గంటలకు హాజరయ్యే విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం మాత్రమే పరిగణించబడతారని తెలిపారు.

టాలెంట్‌స్ప్రింట్‌కు 'ట్రైనింగ్ పార్టనర్ ఆఫ్ ది ఇయర్'



లాస్‌వెగాస్‌లో పెగా సంస్థ ప్రతినిధుల నుంచి అవార్డును స్వీకరిస్తున్న డా. శంతనూపాల్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టాలెంట్‌స్ప్రింట్ సంస్థ 'ట్రైనింగ్ పార్టనర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. లాస్‌వెగాస్‌లో జరిగిన పెగా వరల్డ్ ఇన్‌స్పైయిర్ ఈవెంట్‌లో ఈ అవార్డును టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపకులు, సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూపాల్, ఆపరేషన్స్ ఉపాధ్యక్షుడు రోహిత్ అగర్వాల్‌లు ఇటీవల లాస్‌వెగాస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను పలువురు అభినందించారు.

మేయర్‌ను కలిసిన కార్పొరేటర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మంగళవారం ఆమె కార్యాలయంలో కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డిలు కలిసి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందించారు.

మైనర్ తప్పు.. మేజర్ ముప్పు



- పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు
- సైకిల్ నడపాల్సిన వయస్సులో బైక్‌పై స్వారీ
- ప్రమాదాల్లో ఒకటి మైనర్ డ్రైవింగ్ కేసు
- కఠిన చర్యలు తీసుకుంటామన్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమతో బైక్‌లు, కార్లు ఇస్తున్నారు. వాటిని నడుపుతుంటే చూసి సంబరపడుతున్నారు. అయితే కంటికి రెప్పలా పిల్లలను కాపాడుకోవాల్సిన తల్లిదండ్రులే వాహనాలు ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారు. పట్టణ, మండల ప్రాంతాల్లో 4, 5 ప్రమాదాల్లో ఒకటి మైనర్ల డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

- ప్రస్తుతం పిల్లలు వాహనాలు నడిపేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు వద్దని చెబుతున్నా వారి మాట వినకుండా ద్విచక్ర వాహనాలను తీసుకొని రహదారుల పైకి వస్తున్నారు.
- మరికొందరు స్వయంగా పిల్లలకు డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.
- సైకిల్ నడపాల్సిన వయస్సులో ద్విచక్ర వాహనాలపై స్కూళ్లు, కళాశాలలకు వెళుతున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి దుకాణాల్లో సరుకులు తేవాలని పంపుతున్నారు. మరికొందరు తమ పిల్లలు వాహనం నడుపుతున్నారని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఇలా ఇవ్వడం తప్పని తెలిసీ తప్పు చేస్తున్నారు.

జిల్లాలో మైనర్ డ్రైవింగ్ వివరాలు...

- జిల్లాలోని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 12 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో రూ.6 వేలు జరిమానా విధించారు.
- పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది 313 మైనర్ డ్రైవింగ్ కేసులకు రూ.1,56,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహనాలు నడపాలంటే 18 సంవత్సరాల పైబడి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. గంటకు 25 కిలోమీటర్ల కంటే వేగంగా వెళ్లలేని వాహనాలకు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు. 26 కిలోమీటర్ల కంటే ఒక్క కిలోమీటర్ వేగంగా వెళ్లినా ఎలక్ట్రిక్ వాహనాలైనా రిజిస్ట్రేషన్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.

– రాజా మహమ్మద్, ఎంవీఐ

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి



మైనర్లు వాహనాలు నడపరాదు. మొదటిసారి తనిఖీల్లో పట్టుబడితే వారికి జరిమానా విధించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులను పిలిపించి వారికి కూడా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు, పిల్లలకు వాహనాలు ఇచ్చే వారు ప్రమాదాలబారినపడే విధంగా ప్రోత్సహించడం సరికాదు. వాహనం ఇచ్చే ముందు ఒకసారి ఆలోచించాలి.

– ప్రవీణ్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ

హ్యాకథాన్‌లో సత్తా చాటిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

రూ.50వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్లు



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ బృందానికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ విద్యార్థులు హ్యాకథాన్‌లో మొదటి స్థానంలో నిలిచారని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇటీవల నిర్వహించిన హ్యాకథాన్‌లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఎకో ఛాంపియన్స్' బృందంలో పీహెచ్‌డీ విద్యార్థులు ఎం రాజేష్, ఎం సతీష్‌కుమార్, టి థామస్‌డేవిడ్ సమర్థవంతమైన నీటి నిర్వహణపై తక్కువ ధర ఐఓటీ– ఆధారిత సెన్సార్‌కు రూ.50వేల నగదు పురస్కారం అందించారు. మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం కోసం తక్కువ ధర సాంకేతికత, తక్కువ ఖర్చుతో కూడిన కమ్యూనిటీ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ టెక్నాలజీ, వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర నీటి ఇంటెన్సివ్ రంగాలలో మంచినీటి డిమాండ్‌ను తగ్గించడానికి వినూత్నమైన శక్తి సామర్థ్య, ఆర్థిక పరిష్కారాల వంటి థీమ్‌కు సంబంధించిన ఆలోచనలను టీఎస్‌పీసీబీ ఆహ్వానించింది. ఇందులో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సమర్థవంతమైన నీటి నిర్వహణ పరిష్కారాన్ని అందించడంతో వారికి మొదటి స్థానం లభించింది. వీరికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారు.

సమస్యలపై అఖిలపక్షం సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై మంగళవారం తెల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు కొల్లూరి భరత్, భానూరి మంజుల రెడ్డి, పావని రవీందర్, సరితరెడ్డి, తెల్లాపూర్ బీఎస్పీ అధ్యక్షుడు సుదర్శన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్నారు. ప్రజల అవసరాల కోసం ప్రతి గ్రామానికి 10 ఎకరాల భూమిని ప్రభుత్వం వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొల్లూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానిక కోటా కింద మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు 25శాతం కేటాయించాలన్నారు. చెరువులను కాపాడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందన్నారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీ మేరకు వెంటనే విద్యుత్‌నగర్ ఫైనల్ లేఅవుట్ సమస్య పరిష్కరించాలన్నారు. రింగ్ రోడ్డు నుంచి ఈదులనాగులపల్లి గ్రామం వరకు అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్‌లు మయూరి రాజుగౌడ్, రాంసింగ్, మాజీ ఉప సర్పంచ్‌లు కృష్ణ, పర్సా శ్యాంరావు, బీఎస్పీ అసెంబ్లీ సెగ్మెంట్ అధ్యక్షులు శ్రీశైలం, నాయకులు వడ్డె నర్సింహ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ కాలనీకి చెందిన ప్రదీప్ అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 2 లక్షల 50 వేల రూపాయలను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ బాధితుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం కొనసాగుతుందని, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నదని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, అజీబ్‌బాయి, అక్బర్, తాయిర్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

సైబరాబాద్ విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ నితికాపంత్



విద్యార్థినులతో సైబరాబాద్ విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ నితికాపంత్

రాయదుర్గం: మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నామని సైబరాబాద్ విమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ నితికాపంత్ స్పష్టం చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 1000 మంది విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అపరిచితులు, ఇతరుల అసాధారణ ప్రవర్తన, ఇంట్లో, బయట ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. అనంతరం షీటీమ్ గురించి, పనితీరు అంశంపై వారికి అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ఫోన్‌కాల్, సోషల్ మీడియా ద్వారా వేధింపులు, బాలకార్మికులు, బాలల వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ టీమ్‌ల గురించి కూడా వివరించారు. అనంతరం కేపీహెచ్‌బీలోని రిషీ విమెన్స్ కాలేజ్, కేపీహెచ్‌డీ జేస్పైడర్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ లలో కూడా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా అంజయ్యనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్స్ ఇన్‌స్పెక్టర్ సునీత, మాదాపూర్ ఎస్ఐ భవాని, కేపీహెచ్‌బీ ఎస్ఐ జైరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

మియాపూర్: జనసేన పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్‌గా డాక్టర్ మాధవరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4,116కు పెంచిన సందర్భంగా మంగళవారం చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శేరిలింగంపల్లి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల నుంచి అమలులోకి వస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

- ఆత్మహత్య చేసుకుంటానని మెసేజ్

గచ్చిబౌలి: ఇంట్లో చెప్పకుండా వెళ్లిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుంటానని మెసేజ్ పెట్టడంతో రాయదుర్గం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అంజయ్యనగర్‌లో నివాసం ఉండె విక్రాంత్(23) ఖాళీగా ఉంటున్నాడు. తండ్రి చనిపోగా తల్లి ఇళ్లలో పనులు చేస్తోంది. మంగళవారం ఇంటినుంచి వెళ్లిన విక్రాంత్ మధ్యాహ్నం 2 గంటలకు వరుసకు సోదరుడైన లక్ష్మణ్ వాట్సాప్‌కు మెసేజ్ పెట్టాడు. నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను, అమ్మను బాగా చూసుకోవాలని మెసేజ్ పెట్టడంతో వారు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధన, ప్రచురణ నీతిపై వర్క్ షాప్

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ (జీఎస్బీహెచ్)లో 'పరిశోధన, ప్రచురణ నీతి' అంశంపై రెండు రోజుల కార్యక్రమం ఈనెల 15, 16 తేదీలలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ రూపలత మంగళవారం తెలిపారు. తత్త్వశాస్త్రం, నీతి, శాస్త్రీయ నిర్వహణ, ప్రచురణ నీతి అంశాలపై తొలిరోజు, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రచురించడం, ప్రచురణ దుష్ప్రవర్తన, డేటాబేసెస్, పరిశోధన కొలమానాలు అంశాలపై రెండోరోజు వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా డాక్టర్ జీఎస్పీవీ బాబును 812133 9990 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన మహిళ సంక్షేమ దినోత్సవానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళల కోసం కేసీఆర్ కిట్, ఆసరా పెన్షన్, కళ్యాణ లక్ష్మీ, కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్, అమ్మ బడి వాహనాలు, ఆరోగ్యలక్ష్మీ, షీటీమ్స్, భరోసా, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి వీ–హబ్ తదితర కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు వెంకన్న, సుధాంశ్, సీడీపీఓ లక్ష్మీబాయి, డీఆర్‌డీఏ ఏపీఓ శ్వేత, ప్రాజెక్టు ఆఫీసర్ సుధారాణి, ఇంద్రసేన, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

ఎంఈఓ వెంకటయ్య



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

శేరిలింగంపల్లి: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి మండల విద్యాధికారి కె.వెంకటయ్య తెలిపారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ బడిబాటను విజయవంతం చేసేందుకు ప్రతి స్కూల్ పరిధిలో ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అంగన్వాడీ విద్యార్థులతో పాటు బయట ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో 1100 అడ్మిషన్లు అయినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ఎల్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మన దేశానికి అందం మన సాంప్రదాయాలే

బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొ.ధీరేంద్రకుమార్‌రాయ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ధీరేంద్రకుమార్‌రాయ్

రాయదుర్గం: మనదేశానికి అందం మన సాంప్రదాయాలేనని బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ధీరేంద్రకుమార్‌రాయ్ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మనూలో 'యోగా ఫర్ హ్యూమానిటీ' అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సంప్రదాయాలతో బాటు యోగాను కూడా వదిలివేశామన్నారు. ఇప్పుడిప్పుడే దీనికి ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. హర్యానా కర్నాల్‌కు చెందిన యోగా గురువు డాక్టర్ సరితకుమార్ యోగా, సంగీతంపై అవగాహన కల్పించారు. యోగా, సంగీతం ఈ రెండింటి ద్వారా శ్వాసను నియంత్రించవచ్చన్నారు. మరో గురువు డాక్టర్ రశ్మీ సింగ్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, జీవన విధానమన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వీసీ సయ్యద్ ఐనుల్ హసన్, స్కూల్ ఆఫ్ ఎంసీజే డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, డాక్టర్ అశ్వని, డాక్టర్ ఫిర్దోస్ తబస్సుమ్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

లీకేజీ సమస్య పరిష్కారం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆస్‌బెస్టాస్ కాలనీ కమాన్ వద్ద ప్రధాన రహదారిలో మంచినీటి పైప్‌లైన్ వాల్వ్ లీకేజీతో రోజుల తరబడి తాగునీరు వృధాగా పోతోంది. ఈ నేపథ్యంలో తాగునీరు రోడ్డు పాలు అనే శీర్షికన సోమవారం 'సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి మంగళవారం మంచినీటి పైపులైన్ వాల్వ్‌కు మరమ్మతులు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం





కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, స్వామివారి కల్యాణం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్ 4లోని వేంకటేశ్వరస్వామి ఆలయం 30వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం ఉదయం 8 గంటలకు మహా పూర్ణాహుతి వసంతోత్సవం, కల్యాణోత్సవం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం, ధ్వజారోహణ, ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొని స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన వస్త్రాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

'6 నెలలలోపు వాహనాలు తీసుకెళ్లాలి'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 1,197 వాహనాలను మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉంచామని సైబరాబాద్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల వివరాలను వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.in లో పొందుపరిచారు. ఇందులో మీ వాహనం ఉన్నట్లయితే సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓను కలిసి వాహనం డాక్యుమెంట్లను సమర్పించి తీసుకెళ్లాలని సూచించారు. 6 నెలల కాల పరిమితిలోపు సంప్రదించాలని, లేనట్లయితే ఆ వాహనాలను వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంటీఓ ఎస్ విష్ణు సెల్ నంబర్ 9490617317లో సంప్రదించాలి.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా గోదావరి అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా గోదావరి అంజిరెడ్డి మంగళవారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళతామని తెలిపారు.